మక్కలపై రైతన్న మక్కువ

- జూలూరుపాడు మండలంలో జోరుగా మొక్కజొన్న సాగు
- ఇప్పటికే 500 ఎకరాలకు పైగా నమోదు
- వెయ్యి ఎకరాలు దాటే అవకాశం

జూలూరుపాడు: ఈ ఏడాది యాసంగిలో రైతులు మొక్కజొన్న పంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు. జూలూరుపాడు మండలంలోని పలు గ్రామాల రైతులు ఇప్పటికే 500 ఎకరాల విస్తీర్ణంలో పంట సాగు చేయగా, ఈ విస్తీర్ణం సుమారు 1000 ఎకరాలకు పెరిగే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారుల అంచనా. ఈ ఏడాది అధిక వర్షాలతో పత్తి పంట దెబ్బతినడంతో దిగుబడి తగ్గడంతో పాటు, మార్కెట్‌లో మద్దతు ధర లభించడం లేదు. పత్తి ఎకరానికి 5 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడే వచ్చింది. మిర్చికి తెగుళ్ల సోకడంతో ఈ ఏడాది ఆ పంట సాగునూ తగ్గించారు. అయితే పత్తి పంటతో నష్టపోయిన రైతులు ఆ స్థానంలో మొక్కజొన్న వైపు దృష్టి సారించారు. దీంతో ఎన్నడూలేని విధంగా ఈ యాసంగిలో మొక్కజొన్న సాగు విస్తీర్ణం మూడు రెట్లు పెరగనుంది.


వెంగన్నపాలెంలో సాగులో ఉన్న మొక్కజొన్న పంట

కంపెనీల ప్రోత్సాహం

గత ఏడాది యాసంగిలో 500 ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేయగా ఈ ఏడాది ఇప్పటికే సుమారు 500 ఎకరాల్లో సాగు కాగా మరో 500 ఎకరాల్లో సాగు చేసేందుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. పలు విత్తన కంపెనీలు కూడా మొక్కజొన్న సాగును ప్రోత్సహిస్తున్నాయి. విత్తనాలు ఉచితంగా ఇవ్వడంతోపాటు, పెట్టుబడి కోసం రూ.10 నుంచి రూ.20 వేలు ఇస్తుండటంతో రైతులు మొగ్గు చూపుతున్నారు. ఇది కూడా మొక్కజొన్న సాగు పెరగడానికి కారణంగా చెప్పవచ్చు. మొక్కజొన్న సాగుకు ఎకరానికి రూ.20 నుంచి రూ.25 వేలు పెట్టుబడి అవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. మొక్కజొన్న పంట 100–120 రోజుల్లో చేతికి వస్తుందని, ఎకరానికి పంట దిగుబడి 30 నుంచి 40 క్వింటాళ్లు వస్తుందంటున్నారు. పత్తి, మిర్చి పంటల పెట్టుబడి కోసం చేసిన అప్పులు కొంత మేర పూడ్చుకోవాలనే ఆశతో మొక్కజొన్న సాగు చేస్తున్నట్లు రైతులు పేర్కొన్నారు.

పత్తి నష్టం.. అందుకే..



ఈ ఏడాది పదెకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నా. పత్తి సాగు చేస్తే పెట్టుబడి కూడా తీరలేదు. అంతేకాక రూ.40 వేల నష్టం వచ్చింది. ఆ నష్టాన్ని పూడ్చుకునేందుకు మొక్కజొన్న వేశాను. ప్రస్తుతం మొక్కజొన్న సాగు ఆశాజనకంగా ఉంది.

–భోగిన్ని కృష్ణ, వెంగన్నపాలెం, జూలూరుపాడు మండలం

విత్తన కంపెనీ అండతో..



ఈ ఏడాది మూడెకరాల్లో పత్తి సాగు చేస్తే 24 క్వింటాళ్ల దిగుబడే రావడంతో పెట్టుబడికి సరిపోయింది. దీంతో పత్తి తొలగించి మొక్కజొన్న సాగు చేస్తున్నాం. ఓ కంపెనీ వారు విత్తనాలు ఉచితంగా ఇవ్వడంతోపాటు కొంత పెట్టుబడి పెడుతున్నారు.

–సాయిల పాపారావు, వెంగన్నపాలెం, జూలూరుపాడు మండలం

మొక్కజొన్నే మేలు



అధిక వర్షాలు కారణంగా పత్తి పంట దెబ్బతిని దిగుబడి తగ్గడంతో పెట్టుబడి కూడా రాలేదు. పత్తి పంట తొలగించి మూడు ఎకరాల్లో మొక్కజొన్న పంట వేశా. పత్తి కంటే మొక్కజొన్న లాభదాయకంగా ఉంటుంది. ఈ ఏడాది నాటు మొక్కజొన్న సాగు చేస్తున్నాం.

–చావలమడుగు రామ్మూర్తి, జూలూరుపాడు

యాసంగిలో పెరిగిన సాగు



యాసంగిలో మొక్కజొన్న సాగు విస్తీర్ణం గణనీయంగా పెరగనుంది. పంట లాభదాయకంగా ఉండటంతో ఏటా ఈ సీజన్‌లో రైతులు మొగ్గు చూపుతున్నారు. ఈ పంట 100 – 120 రోజుల్లో చేతికొచ్చి తక్కువ పెట్టుబడితో మంచి దిగుబడి ఉంటుంది.

–దీపక్ ఆనంద్, వ్యవసాయశాఖ అధికారి, జూలూరుపాడు

నేటి నుంచి గ్రామసభలు

జూలూరుపాడు: ఈ నెల 26వ తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం మంగళవారం నుంచి గురువారం వరకు మూడు రోజులు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ డి.కరుణాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 21న అనంతారం, చింతలతండా, గురువాగుతండా, సాయిరాంతండా, భోజ్యాతండా, గాంధీనగర్, నల్లబండబోడు, శంభునిగూడెం, 22న అన్నారుపాడు, గుండెపుడి, కరివారిగూడెం, వినోభానగర్, కొమ్ముగూడెం, కొత్తూరు, మాచినేనిపేట, సురారం, 23న భేతాళపాడు, పడమటనర్సాపురం, పాపకొల్లు, వెంగన్నపాలెం, గుండ్లరేవు, జూలూరుపాడు, కాకర్ల, మాచినేపేటతండాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

ఇల్లెందు: మూడు రోజులపాటు వార్డు సభలు నిర్వహించనున్నట్లు కమిషనర్ శ్రీకాంత్ సోమవారం తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు నుంచి 8వ వార్డు వరకు 21వ తేదీన, 9వ వార్డు నుంచి 16వ వార్డు వరకు 22వ తేదీన, 17వ వార్డు నుంచి 24వ వార్డు వరకు 23వ తేదీన వార్డు సభలు నిర్వహిస్తామని తెలిపారు.

టేకులపల్లి: గ్రామసభలు ఈ నెల 21 నుంచి 24 వరకు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నాగభవానీ సోమవారం తెలిపారు. 21న ముత్యాలంపాడు క్రాస్‌రోడ్, రాంపురం, చుక్కాలబోడు, రోళ్లపాడు, పెట్రాంచెలక, కుంటల్ల, ఎర్రాయిగూడెం, మొక్కంపాడు, బర్లగూడెం, 22న బద్దుతండా, పెగళ్లపాడు, బేతంపూడి, గోల్యాతండా, బిల్లుడుతండా, లచ్చగూడెం, కిష్టారం, కొత్తతండా(జి), శంభునిగూడెం, 23న తావుర్యాతండా, చంద్రుతండా, గొల్లపల్లి, మద్రాస్‌తండా, బోడు, రామచంద్రునిపేట, చింతలంక, తొమ్మిదోమైలుతండా, కొత్తతండా(పి), 24న టేకులపల్లి, దాసుతండా, తడికలపూడి, సులానగర్, కోయగూడెం, కొప్పురాయి, మేళ్లమడుగు, చింతోనిచెలక, గంగారం పంచాయతీల్లో గ్రామ సభలు జరుగుతాయని చెప్పారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

పాల్వంచ: నాలుగో విడత రుణమాఫీ అయిన రైతులు దరఖాస్తు చేసుకుని, తిరిగి రుణాలు పొందాలని రాష్ట్ర మార్క్‌ఫెడ్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు సూచించారు. సోమవారం పాల్వంచ సహకార సంఘం కార్యాలయంలో పాలక వర్గ సమావేశం నిర్వహించారు. రైతులు సకాలంలో రుణాలు రెన్యూవల్ చేసుకుని 7 శాతం వడ్డీని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంపెల్లి కనకేశ్, బుడగం రాంమోహన్‌రావు, కనగాల నారాయణరావు, చౌగాని పాపారావు, సామా జనార్దన్‌రెడ్డి, జరబన సీతారాంబాబు, యర్రంశెట్టి మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాల కోసం..

ఇల్లెందు: కార్పొరేట్ కళాశాలలకు దీటుగా గతేడాది రాష్ట్రస్థాయి ర్యాంకుతో గుర్తింపు పొందిన ఇల్లెందు మైనారిటీ గురుకుల కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ముదసర్ హుస్సేన్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఇంటర్ ఎంపీసీ, బైపీసీలలో ముస్లిం మైనారిటీలకు 60 సీట్లు, ఇతరులకు 20 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఇంటర్‌లో ప్రవేశాల కోసం ఈ నెల 18 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

జూలూరుపాడు: అర్హులందరికీ సంక్షేమ పథకాలకు అందించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ మండల సమితి ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చంద్ర నరేంద్రకుమార్ మాట్లాడుతూ.. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు ఇవ్వాలని, ప్రభుత్వ పథకాల్లో రాజకీయ జోక్యం లేకుండా నిజమైన నిరుపేదలను గుర్తించాలని, లేనిపక్షంలో గ్రామసభలను అడ్డుకుంటామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ కె.స్వాతిబిందుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గుండెపిన్ని వెంకటేశ్వర్లు, యల్లంకి మధు, ఎస్కె నాగుల్ మీరా, గుడిమెట్ల సీతయ్య, ఎస్కె చాంద్‌పాషా, పొన్నెకంటి వెంకటేశ్వర్లు, యాసా రోశయ్య, సొబ్బెన సూరయ్య, వల్లమల్ల సామేలు, చిమట ముత్తయ్య, చెరుకుమల్ల రాజేశ్వరరావు, బడుగు వీరస్వామి, పత్తిపాటి మహేశ్ పాల్గొన్నారు.

రూ.12 వేలు ఇవ్వాలి

టేకులపల్లి: ఆటో మోటార్ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ) జిల్లా ప్రథమ మహాసభ టేకులపల్లి సెంటర్లో సోమవారం జరిగింది. తొలుత యూనియన్ జెండాను రాష్ట్ర కార్యదర్శి పాయం వెంకన్న ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముద్దా భిక్షం మాట్లాడుతూ.. దేశంలో పని చేస్తున్నటువంటి మోటార్ డ్రైవర్లు దుర్భరమైన జీవితం గడుపుతున్నారన్నారు. తర్వాత టీయూసీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి షేక్ యాకుబ్‌షావలి మాట్లాడారు. ఏరియా కార్యదర్శి జరుపుల సుందర్, గోనెల రమేశ్, గోపాల్‌రావు, పి.సతీశ్, చంద్రశేఖర్, వేల్పుల రమేశ్, పిల్లి రాజేశ్, ధనసరి రాజేశ్, టేకులపల్లి బ్రాంచ్ కార్యదర్శి గుగులోత్ మదార్, రంగారావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

ఇల్లెందు: మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్యం మెరుగుపర్చడమే లక్ష్యంగా స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ను అధికారులు మూడు రోజుల కిందట ప్రారంభించారు. సోమవారం పలు వార్డుల్లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ను మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు. సిబ్బందికి పలు సూచనలు చేస్తూ నిర్దేశించుకున్న గడువులోగా పనులు పూర్తి చేయాలన్నారు. వార్డులకు కేటాయించిన సిబ్బందితో ప్రణాళికాబద్ధంగా పనులు చేయించుకొని పట్టణాన్ని స్వచ్ఛతకు నిలయంగా తీర్చిదిద్దాలని కోరారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

సూపర్‌బజార్(కొత్తగూడెం): తెలంగాణ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆవిష్కరించారు. జిల్లా కన్వీనర్ వనమా శ్రీనివాసరావు, కోకన్వీనర్ వేగా నాగరాజు, జిల్లా కోశాధికారి నందకిషోర్, జిల్లా ఉపాధ్యక్షుడు సమ్మయ్య, శివ, ఉదయ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

జూలూరుపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎల్లంకి కల్యాణి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం వ్యాసరచన, క్విజ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు నిర్వాహకులు, హైస్కూల్ హెచ్‌ఎం, ఉపాధ్యాయులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ యల్లంకి రమేశ్, నాగమణి, శ్రీదేవి, శ్రీధర్, యల్లంకి సత్యనారాయణ, సాయిల నాగేశ్వరరావు, హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య పాల్గొన్నారు.

రొంపేడులో నిర్మించాలి

ఇల్లెందురూరల్: సమీకృత గురుకులాల సముదాయాన్ని మండలంలోని రొంపేడు రెవెన్యూ పరిధిలో నిర్మించాలని కోరుతూ సేవాలాల్ సేన నాయకులు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. రొంపేడు రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 309 పరిధిలో 30 ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని, గురుకులాల సముదాయం నిర్మాణానికి అనువుగా ఉందని తెలిపారు.

పట్టణాభివృద్ధికి అవిశ్రాంత కృషి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణ సమగ్రాభివృద్ధికి, ప్రజలకు కనీస మౌలిక వసతుల కల్పనకు అవిశ్రాంతంగా కృషి చేస్తానని కొత్తగూడెం నియోజకవర్గ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మున్సిపాలిటీలోని పది వార్డుల్లో రూ.4.42 కోట్ల డీఎంఎఫ్ నిధులతో చేపట్టనున్న 31 అభివృద్ధి పనులకు సోమవారం ఎమ్మెల్యే కూనంనేని శంకుస్థాపన చేశారు. ఈ నెల 26న మున్సిపల్ పాలకవర్గం పదవీకాలం ముగుస్తుండటంతో వారి సేవలకు గుర్తింపు తెచ్చేందుకు ముమ్మరంగా శంకుస్థాపన కార్యక్రమాలు చేపడుతున్నామని, వారం రోజుల వ్యవధిలోనే కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో రూ.8.37 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నామని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ఎస్‌కే సాబీర్‌పాషా, కాపు సీతాలక్ష్మి, పుల్లయ్య, శేషాంజన్‌స్వామి, రవికుమార్, కంచర్ల జమలయ్య, బోయిన విజయ్‌కుమార్, అనిల్, పరమేశ్ యాదవ్, లక్ష్మణ్, నేరెళ్ల సమైక్య, కోలాపూరి ధర్మరాజు, కె.సుజాత, భీమా శ్రీవల్లి, బండి నర్సింహారావు, దుర్గ, భూక్యా శ్రీనివాస్, సలిగంటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్పొరేషన్‌తో అభివృద్ధి వేగవంతం

కొత్తగూడెం కార్పొరేషన్ కావడంతో అభివృద్ధి వేగవంతమవుతుందని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి అధ్యక్షతన మున్సిపల్ పాలకవర్గ చివరి సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. అనంతరం ఎజెండాలోని 25 అంశాలపై కౌన్సిల్ సభ్యులు చర్చలు జరిపి, ఆమోదించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి, డీఈ రవికుమార్, మేనేజర్ ప్రసాద్, అబ్దుల్ ఖాదర్, రవీంద్రకుమార్, మూడ్ అశోక్ పాల్గొన్నారు.

ఆర్టిజన్ కార్మికుల రిలే నిరాహార దీక్ష

సూపర్‌బజార్(కొత్తగూడెం): సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యుత్ ఎస్‌ఈ కార్యాలయం ఎదుట ఆర్టిజన్ కార్మికులు సోమవారం రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 20వ తేదీ నుంచి 24వ తేదీ వరకు రిలే నిరాహార దీక్షలను కొనసాగించనున్నారు. మొదటి రోజు దీక్షలో జేఏసీ జిల్లా చైర్మన్ కూనురాజు శ్రీనివాస్, కన్వీనర్ బుడిగ రమేశ్, కోకన్వీనర్ కత్తి కోటేశ్, పూర్ణిమ, జి.వెంకటేశ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి జి.స్వప్న, ఎస్.విష్ణు, కమిటీ సభ్యులు ఆర్.శ్రీనివాస్, బి.వెంకన్న, బి.జయలక్ష్మి, ఎస్‌కే రంజాన్, బి.దీప్తి, హెచ్.పుణ్యవతి, ఆర్టిజన్ కార్మికులు పాల్గొన్నారు.


దీక్షలో కూర్చున్న ఆర్టిజన్ కార్మికులు

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


పాల్వంచరూరల్: వాహనానికి సీటు బెల్టు స్టిక్కర్ అంటిస్తున్న ఏఎంవీఐ ఫరూక్

పాల్వంచరూరల్/కొత్తగూడెంఅర్బన్/టేకులపల్లి: వాహనదారులు తప్పనిసరిగా సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని రవాణా శాఖ, పోలీస్ అధికారులు సూచించారు. కొత్తగూడెం పట్టణంతోపాటు పాల్వంచ, టేకులపల్లి మండలాల్లో సోమవారం జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా వాహనాల డ్రైవర్లకు అవగాహన కల్పించారు. వాహనాలకు సీటు బెల్టు స్టిక్కర్లను అంటించారు. ఆయా కార్యక్రమాల్లో ఏఎంవీఐ ఎండీ ఫరూక్, డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, కానిస్టేబుల్ రాజశేఖర్, బండారి రుక్మేందర్, ఎస్‌ఐ శ్రీకాంత్, ఏఎస్‌ఐ రఘు, మునిగ సుజాత, రవీందర్, హరిబాబు, లాలు, రామారావు, దేవీలాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో ప్రదర్శన

జూలూరుపాడు: జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం జూలూరుపాడు ఎస్‌ఐ బాదావత్ రవి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో విద్యార్థులు, పోలీస్, అటవీ సిబ్బంది, ఉపాధ్యాయులు భారీ ప్రదర్శన నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి జూలూరుపాడులోని చంద్రుగొండ క్రాస్ రోడ్ వరకు కొనసాగిన ర్యాలీలో విద్యార్థులు, పోలీస్, అటవీ సిబ్బంది నినాదాలు చేశారు. అనంతరం మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య, పోలీస్, అటవీ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంఈఓ కార్యాలయాల ఎదుట ధర్నా

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంతో పాటుగా మరో మూడు మండల విద్యాశాఖ కార్యాలయాల ఎదుట సోమవారం మధ్యాహ్న భోజన వర్కర్లు ధర్నా నిర్వహించి ఎంఈఓలకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ.. ప్రభుత్వం చెల్లిస్తామని చెప్పిన నెలకు రూ.పదివేల వేతనం వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాఠశాలలకు కోడిగుడ్లు ప్రభుత్వమే సరఫరా చేయాలని, ప్రతి విద్యార్థికి మెనూ చార్జీ రూ.25 చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న కోడిగుడ్ల బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు. లేనిపక్షంలో సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన వర్కర్లు

అ 'పూర్వ' సమ్మేళనం

జూలూరుపాడు: పాపకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. 2000–2001 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు 25 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకోవడంతోపాటు యోగ క్షేమాలు, కుటుంబ వివరాలు అడిగి తెలుసుకొని, సరదాగా గడిపారు. అనంతరం ఆనాటి గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గురువులు మద్దిశెట్టి వెంకటేశ్వరరావు, లక్ష్మీనారాయణ, ఖుర్షిద్, శంకర్ మహదేవన్, మురళీకృష్ణ, కృష్ణమోహన్, పూర్వ విద్యార్థులు జి.నరసింహారావు, బి.శ్రీను, రమేశ్, నాగేశ్వరరావు, హరీశ్, వెంకటేశ్వర్లు, రాంబాబు, గన్యా, ప్రసన్న, సంగీత, స్వరూప, వెంకటరమణ పాల్గొన్నారు.

జంతు మాంసంతో రోగాలు


పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాల్వంచ: జంతు మాంస భక్షణ సకల రోగాలకు మూలం అని పాల్వంచ సుధాదేవి పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ మూమెంట్ ధ్యాన గురువు, రాష్ట్ర సేవాదల్ ఉపాధ్యక్షులు సూరంపల్లి హనుమంతరావు పేర్కొన్నారు. సోమవారం సుధాదేవి పిరమిడ్ 13వ వార్షికోత్సవం సందర్భంగా పట్టణంలో అహింసాయుత మహాకరుణ ర్యాలీని నిర్వహించారు. సరస్వతి, శరత్, రమేశ్, వెంకటేశ్వరరావు, శైలజ, సీతయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థుల అభివృద్ధే లక్ష్యం

ఇల్లెందురూరల్: తాను ఏ పదవిలో ఉన్నా పనిచేస్తున్న కళాశాల, విద్యార్థుల అభివృద్ధే ప్రథమ కర్తవ్యంగా భావిస్తానని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిన్నప్పయ్య అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన చిన్నప్పయ్యను కళాశాల ఆవరణలో అధ్యాపకులు సోమవారం ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్‌గా తాను పనిచేసిన ప్రతి కళాశాల అభివృద్ధికి అహర్నిశలు శ్రమించి ఫలితాలు సాధించానని గుర్తుచేశారు. ప్రభాకర్‌రావు, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ నాగేశ్వరరావు, పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దాడి చేసినవారిని కఠినంగా శిక్షించాలి

పాల్వంచ: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం కంబాలపల్లి రాములుపై అల్లరి మూకలు దాడి చేయడాన్ని ఖండిస్తున్నామని, దాడి చేసిన వారిని శిక్షించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.రాజు అన్నారు. సోమవారం పాత పాల్వంచ ప్రభుత్వ పాఠశాలలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు వెంకటేశ్వర్లు, బి.మురళీమోహన్, ఎస్.వరలక్ష్మి, ఎస్.వెంకటేశ్వర్లు, ఎం.రాజయ్య, పి.జయరాజు, బి.రాంబాబు, ఎస్.కృష్ణ, ఎస్.విజయ్‌కుమార్, బి.రాము పాల్గొన్నారు.

ఇల్లెందు/టేకులపల్లి: రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం కె.రాములుపై దాడిని ఖండిస్తూ సోమవారం ఇల్లెందులోని పలు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, టీఎస్‌యూటీఎఫ్ నేతలు నిరసన తెలిపారు. అలాగే, టేకులపల్లి మండలంలోని అన్ని ప్రభుత్వ, మండల, జిల్లా పరిషత్ పాఠశాలల్లో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దుదాం


పూబెల్లి చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య, గ్రామస్తులు

ఇల్లెందురూరల్: సహజ సిద్ధంగా ఉన్న అందాలకు పర్యాటక కళను జోడించేలా సమష్టిగా శ్రమించి పూబెల్లిని పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దుకుందామని ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచించారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ కృషితో పర్యాటక క్షేత్రం దిశగా అడుగులు వేస్తున్న మండలంలోని పూబెల్లి గ్రామాన్ని సోమవారం ఎమ్మెల్యే కోరం కనకయ్య సందర్శించారు. గ్రామస్తులు, అధికారులతో కలిసి పూబెల్లి శివారులోని చెరువును, పర్యాటకుల విడిది కోసం ఎంపిక చేసిన ప్రదేశాన్ని పరిశీలించారు. పర్యాటక క్షేత్రంగా ఎంపిక చేయడానికి గల కారణాలు, భవిష్యత్‌లో పర్యాటకుల కోసం సమకూర్చేందుకు ఎంపిక చేసిన అంశాలు, సమగ్ర ప్రణాళికను ఎంపీడీఓ ధన్‌సింగ్, సెర్ప్ ఏపీఎం దుర్గారావు ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం గ్రామస్తులు, అధికారులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. పర్యాటకులకు సౌకర్యాలు, సదుపాయాలు సమగ్రంగా అందుబాటులో ఉండేలా గ్రామస్తులు ప్రత్యేక కమిటీలుగా ఏర్పడాలని సూచించారు. పర్యాటకుల విడిది, ఆహారం, పర్యటన, కాలక్షేపం తదితర అంశాల కోసం కల్పించాల్సిన సౌకర్యాలపై చర్చించారు. దీనికోసం స్థానిక అధికారులు, గ్రామస్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రక్రియ విజయవంతంగా ప్రారంభమయ్యే వరకు తాను పూబెల్లి గ్రామాన్ని క్రమం తప్పకుండా సందర్శిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీఓ చిరంజీవి, పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ, స్థానికులు మూతి ముత్యాలు, ఉమారాణి, జోగా శ్రీకాంత్, ఎట్టి కిరణ్, కాంగ్రెస్ నాయకులు మండల రాముమహేశ్, నాలవెల్లి నర్సింహారావు, ఊరకొండ ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

వన్య ప్రాణుల సంరక్షణకు చర్యలు


మాట్లాడుతున్న కొత్తగూడెం ఎఫ్‌డీఓ కోటేశ్వరరావు

జూలూరుపాడు: వన్య ప్రాణుల సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కొత్తగూడెం ఎఫ్‌డీఓ కోటేశ్వరరావు అన్నారు. సోమవారం జూలూరుపాడు ఎఫ్‌ఆర్‌ఓ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఎఫ్‌ఆర్‌ఓ, అటవీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అడవుల అభివృద్ధి, రాబోయే వేసవిలో అడవులు అగ్ని ప్రమాదానికి గురి కాకుండా తీసుకోవాల్సిన చర్యలు, అడవి జంతువుల వేట నియంత్రణపై అటవీ సిబ్బందికి ఎఫ్‌డీఓ కోటేశ్వరరావు సూచనలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అటవీ సరిహద్దు ప్రాంతంలో సాగు చేసుకునే రైతులు పంట వ్యర్థాలు కాల్చేటప్పుడు తగు జాగ్రత్త వహించాలన్నారు. అటవీ ప్రాంతంలో నీటి కుంటల వద్ద అడవి జంతువుల కోసం వేటగాళ్లు పెట్టే ఉచ్చులను గుర్తించి తొలగించే చర్యలు చేపట్టాలని అటవీ సిబ్బందిని ఆదేశించారు. వన్యప్రాణుల సంరక్షణపై ప్రత్యేక నిఘా వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నట్లు ఎఫ్‌డీఓ ప్రకటించారు. కార్యక్రమంలో జూలూరుపాడు ఎఫ్‌ఆర్‌ఓ జి.ప్రసాద్‌రావు, ఎఫ్‌ఎస్‌ఓలు హనుమంతు, మల్లయ్య, సలీం, బీట్ ఆఫీసర్లు రేఖ, శ్రీలత, విజయలక్ష్మి, కిషన్, నరసింహారావు, రహీం, తదితరులు పాల్గొన్నారు.

'ఇగ్నో'పై అవగాహన సదస్సు


మాట్లాడుతున్న డాక్టర్ బొల్లం రాజు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో సోమవారం ఇగ్నో ఓపెన్ యూనివర్సిటీ ప్రాముఖ్యత, విధి విధానాలపై విద్యార్థినులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హైదరాబాద్ ఇగ్నో రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ బొల్లం రాజు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఇగ్నో నుంచి అందించే స్టడీ మెటీరియల్ అత్యున్నతమైనదని, సివిల్స్ స్థాయికి తగ్గ పాఠ్య ప్రణాళిక అంశాలు ఇగ్నో సొంతమని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కె.సునీల్‌కుమార్, ప్రిన్సిపాల్ శారద, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

హరగోపాల్, లక్ష్మణ్ అరెస్ట్ హేయం

పాల్వంచ/సింగరేణి(కొత్తగూడెం): నాగర్‌కర్నూల్ జిల్లా మైలారం గ్రామంలో గుట్ట ధ్వంసం చేయడానికి వ్యతిరేకంగా గ్రామస్తులు చేపట్టిన రిలేనిరాహార దీక్షలకు సంఘీభావం తెలిపేందుకు వెళ్తున్న ప్రొఫెసర్ హరగోపాల్, గడ్డం లక్ష్మణ్‌ను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తున్నామని పౌర హక్కుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఎస్.ఉపేందర్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పర్యావరణ విధ్వంసం ఆపాలని, మైలారం గుట్ట తవ్వకాలు నిలిపివేయాలని, ప్రజలు జీవించే హక్కు ప్రమాదంలో పడుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నా ప్రభుత్వం పెడచెవిన పెడుతోందన్నారు. అరెస్ట్ చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, వారి అరెస్ట్‌లను సీపీఐ (ఎంఎల్) ఎన్డీ జిల్లా కమిటీ సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు ఒక ప్రకటనలో ఖండించారు.

మంత్రి పర్యటనకు ఏర్పాట్లు

ఇల్లెందు: ఈ నెల 22న ఇల్లెందు పట్టణంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల కోసం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రానుండగా ముమ్మరంగా ఏర్పాట్లు సాగుతున్నాయి. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇల్లెందుకు చేరుకుంటారు. ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే కోరం కనకయ్య, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, వైస్ చైర్మన్ జానీపాషా, కమిషనర్ శ్రీకాంత్, డీఈ మురళి, ఇతర అధికారులు పాల్గొంటారని మున్సిపల్ చైర్మన్ డీవీ సోమవారం వెల్లడించారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 భద్రాచలం ఎన్. లక్ష్మయ్య - 80742 70476
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎన్ దుర్గారాంప్రసాద్ -9000327175 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎస్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

టి. రాజేష్ - 90102 23783
ఎ. నాగేశ్వరరావు - 97054 44183
ఎస్. శేషయ్య - 99121 99148